
25న మంత్రివర్గ సమావేశం

● బడ్జెట్ అంశాలపై చర్చ

ప్యారీస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 25వ తేదీ జరుగనుంది. మధ్యాహ్నం 12 గంటలకు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో ప్రధానంగా బడ్జెట్ కూర్పు, శాఖల వారీగా నిధుల కేటాయింపుపై చర్చించనున్నారు. వచ్చే నెల 14వ తేదీ బడ్జెట్ సమావేశం జరుగనున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనరంజకంగా బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సీఎం స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బడ్జెట్ నివేదికలో ఉండాల్సిన కీలక అంశాల గురించి చర్చించేందుకు వచ్చే మంగళవారం మంత్రివర్గం జరుగుతుందని సచివాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ బడ్జెట్‌లోనే ప్రజాకర్షక పథకాలకు నాంది పలికేందుకు అవకాశముంది. ప్రజల అంచనాలకు తగినట్లుగా నిధుల కేటాయింపుపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.



తమిళ సాహితీవేత్త డాక్టర్ ఉ.వే. సామినాథయ్యర్ 171వ జయంతి వేడుకల సందర్భంగా చెన్నై రాజధాని కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు తంగం తెన్నరసు, సామినాథన్, శాసనసభ్యుడు ఏఎంవీ విక్రమరాజా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, తదితరులు



టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులోని టీటీడీ పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం సాయంత్రం సింహవాహనంపై ఆశీనులైన అమ్మవారు

90 శాతం ఎన్నికల హామీలు నెరవేర్చాం!

● ఉత్తర చెన్నై అభివృద్ధికి రూ.6400 కోట్లు
● సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లుగా డీఎంకే ద్రావిడ తరహా పాలనలో 90 శాతం ఎన్నికల హామీలను నెరవేర్చామని, వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోగా మిగతా 10 శాతం హామీలను కూడా నెరవేరుస్తామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. స్థానిక పుళియంతోపు డికాస్టర్ రోడ్డులోని డాన్ బాస్కో పాఠశాల మైదానంలో బుధవారం ఉదయం జరిగిన సభలో రాష్ట్ర నగర నివాసాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చంద్రయోగి సమాధి, రాధాకృష్ణపురం, సత్యవాణిముత్తునగర్ ప్రాజెక్టు ప్రాంతాల్లో 712 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులను ఆయన అందజేశారు.



లబ్ధిదారులకు ఇళ్లకేటాయింపు ఉత్తర్వులను అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఉత్తర, దక్షిణ చెన్నై ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న సత్సంకల్పంతో పదేళ్లుగా అన్ని రంగాల్లో వెనుకబడిన ఉత్తర చెన్నై అభివృద్ధి పథకానికి ముందుగా తాను రూ.1000 కోట్ల మేర నిధులు విడుదల చేశానని, అయితే చేపట్టాల్సిన ప్రాజెక్టులు అధికంగా ఉన్నాయనే విషయం తన దృష్టికి రావడంతో ఆ మొత్తాన్ని రూ.6400 కోట్లకు పెంచానని చెప్పారు. గత నాలుగేళ్లుగా డీఎంకేకు ఓటువేయని ప్రజలంతా మెచ్చుకునేలా పరిపాలన చేస్తున్నామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో 90 శాతం నెరవేర్చటమే కాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో లేని హామీలను అమలు చేశామని, కొత్త సంక్షేమ పథకాలను కూడా ప్రకటించామని చెప్పారు. ప్రస్తుతం తన చేతుల మీదుగా ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులందుకున్న లబ్ధిదారులు ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని, ఉండడానికి నివాసంగా ఉందని, గర్వంగా జీవించాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామో అన్బరసన్, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై మేయర్ ఆర్ ప్రియా, ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి, శాసనసభ్యులు తాయగం కవి, ఇ.పరంధామన్, ఎ.వెట్రిఅళగన్, జోసెఫ్‌సామువేల్, రాష్ట్ర గృహవసతి నగరాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉష, కార్పొరేషన్ కమిషనర్ జే కుమారగురుబరన్, రాష్ట్ర నగర నివాసాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ప్రభాకర్, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బిర్యానీ విందు...

ఈ కార్యక్రమం అనంతరం కొత్త ఇళ్లలో నివసించనున్న లబ్ధిదారులకు బిర్యానీ విందు ఏర్పాటు చేశారు. వారికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బిర్యానీ వడ్డించారు. స్వయంగా సీఎం తమకు బిర్యానీ వడ్డించడంతో లబ్ధిదారులు సంబరపడ్డారు.



లబ్ధిదారులకు బిర్యానీ వడ్డిస్తున్న స్టాలిన్

కాలేజీ బస్సు బోల్తా

● ఇద్దరు విద్యార్థినులు సహా ముగ్గురి మృతి

6

● తిరుప్పరంకుండ్రం వివాదం...

పిటిషనర్లకు హైకోర్టు చీవాట్లు



● అన్ని పిటిషన్లూ తోసివేత

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం పర్వతంపై రాష్ట్ర ప్రజలెవరూ కొట్లాడుకోవడం లేదని, అయితే ఆ పర్వతాన్ని వివాద వస్తువుగా మార్చిన పిటిషనర్లు ప్రజల మధ్య గొడవలు సృష్టించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారంటూ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రశాంతంగా ఉన్న ప్రజల మధ్య అనవసరమైన గొడవలు సృష్టించేలా పిటిషనర్లు ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోందని చీవాట్లు పెట్టింది. అంతటితో ఆగకుండా తిరుప్పరంకుండ్రం పర్వతానికి సంబంధించి దాఖలైన అన్ని పిటిషన్లను తోసివేస్తున్నట్లు ప్రకటించింది.. తిరుప్పరంకుండ్రంపై ఓ వైపు శైవాలయం (మురుగప్పెరుమాన్ ఆలయం) మరో వైపు ప్రాచీన సిక్కిందర్ దర్గా ఉన్నాయి, రెండు మతాలకు చెందిన వారు ఆ రెండు ప్రాంతాలకు ఎన్నో ఏళ్లుగా వెళ్లి పూజలు చేసుకుంటూ ప్రశాంతంగా ఉంటున్నారు. ఇటీవల కొందరు ముస్లిం యువకులు కొండపై దర్గా వద్ద బలివ్వడానికి మేకపోతును తీసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఆ పర్వతం వివాదాస్పదంగా మారింది. ఆ పర్వతాన్ని పరిరక్షించేందుకు ఈ నెల 4న తిరుప్పరంకుండ్రం వద్ద ధర్నా నిర్వహించేందుకు పోలీసుల అనుమతిచ్చేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ రాష్ట్ర హిందూ మున్నాని తరఫున హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ వేసింది. హిందూ మున్నాని ధర్నా పిలుపునివ్వడంతో మదురై జిల్లా కలెక్టర్ ఈ నెల 3 నుండి రెండు రోజులపాటు 144 నిషేధాజ్ఞలు విధించడాన్ని సవాలు చేస్తూ మరికొందరు పిటిషన్లు వేశారు. అదే సమయంలో కొండపై మాంసాహారం తీసుకెళ్లకుండా పోలీసులు చేసిన వాహనతనిఖీలకు వ్యతిరేకంగా మురుగన్ అనే భక్తుడు కూడా పిటిషన్ వేశాడు. ఈ పిటిషన్లపై విచారణ పెండింగ్‌లో ఉండగానే తిరుప్పరంకుండ్రం పర్వతానికి దూరంగా పళంగానత్తం వద్ద ఈ నాలుగో తేదీ సాయంత్రం గంటపాటు హిందూమున్నాని, ధర్నా చేసుకునేలా న్యాయమూర్తులు మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ నేపథ్యంలో తిరుప్పరంకుండ్రం పర్వతానికి సంబంధించిన పిటిషన్లన్నీ బుధవారం ఉదయం న్యాయమూర్తులు జే.నిషాభాను, ఎస్.శ్రీమతి ఎదుట విచారణకు వచ్చాయి. తిరుప్పరంకుండ్రం పర్వతంపై హక్కులు తమవేనంటూ రెండు మతాల వారు వాదిస్తుండటంతో ఆ పర్వతాన్ని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి తరలించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరారు. వెంటనే న్యాయమూర్తులు జోక్యం చేసుకుంటూ తిరుప్పరంకుండ్రం తమకే కావాలని, తమకే చెందాలని ప్రజలెవరూ కొట్లాడుకోకపోయినా, మీరే ప్రజలను రెచ్చగొట్టి ఘర్షణలకు దిగేలా చేసేటట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుబంధ పిటిషనర్లు వాదిస్తూ తిరుప్పరంకుండ్రం పూజా, ఆరాధన హక్కులకు సంబంధించిన కేసుల్లో సుప్రీం కోర్టు స్టే విధించిందని, ప్రధానమైన పిటిషన్లపై ఆ సర్వోన్నతమైన న్యాయస్థానం విచారణ జరపాల్సి ఉందన్నారు. ఈ పరిస్థితులలో పిటిషనర్లు ఈ వివాదంపై సుప్రీంకోర్టునే ఆశ్రయించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తులు తిరుప్పరంకుండ్రం పర్వతానికి సంబంధించి దాఖలైన పిటిషన్లను తోసిపుచ్చారు.

సెల్వపెరుందగైపై తిరుగుబావుటా



● 25 మంది జిల్లా కార్యదర్శుల అసంతృప్తి
● ఢిల్లీ వెళ్లి ఫిర్యాదు
● ఆయన్ని తొలగించాలని డిమాండ్

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగైపై 25 మంది జిల్లా కార్యదర్శులు తిరుగుబావుటా ఎగురవేశారు. . నియంతలా వ్యవహరిస్తున్న ఆయన్ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది. పార్టీలో కొత్త ఉత్సాహం నింపాలన్న ఉద్దేశంతో ఆరేళ్ల క్రితం డీపీఐ నుంచి వచ్చిన సెల్వపెరుందగైకి కాంగ్రెస్ అధిష్టానం రెండేళ్లక్రితం పగ్గాలు అప్పజెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆయన కొన్ని ప్రకటనలు, వ్యవహారశైలి ఆది నుంచి పార్టీలో అసంతృప్తికి కారణమవుతోంది. అయితే పార్టీని కిందిస్థాయి నుంచి బలోపేతం చేయాలనే లక్ష్యంతో వున్న సెల్వపెరుందగై. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ కమిటీలను నియమించి, వారికి గుర్తింపుకార్డులు కూడా ఇస్తున్నారు. ప్రజల వద్దకు వెళ్లడం, పార్టీ, కూటమి గురించి ప్రచారం చేయడం, స్థానిక సమస్యల్ని పార్టీ దృష్టికి తీసుకురావడం వంటి కార్యకలాపాలను ఆయా కమిటీలను అప్పగించారు. అయితే ఇదే వివాదానికి కారణంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా వున్న 72 మంది జిల్లాల కార్యదర్శుల్లో 25 మంది సెల్వపెరుందగై చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో వారు ఇటీవల సెల్వపెరుందగై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కూడా డుమ్మా కొట్టినట్లు తెలిసింది.

ఆయన్ని మార్చాల్సిందే: ఎంఎస్ ద్రవ్యం

ఢిల్లీలో ఫిర్యాదు చేసిన అనంతరం చెన్నైకి చెందిన ఎంఎస్ ద్రవ్యం మీడియాతో మాట్లాడుతూ.. సెల్వపెరుందగై బాధ్యతలు చేపట్టాక ఇప్పటి వరకూ జిల్లా కార్యదర్శుల సమావేశం నిర్వహించలేదని, పార్టీ ముఖ్య నేతలతోనూ మాట్లాడ్డం లేదని ఆరోపించారు. ఆయన ఏర్పాటు చేసిన గ్రామ కమిటీలు గతంలోనే ఉండేవని, అయితే ఇప్పుడు ఆయన కొత్తగా ఏర్పాటు చేసినట్లు ప్రచారం చేసుకుంటూ ఆయన ఫొటోతో కూడిన ఐడీ కార్డులు ఇస్తున్నారని ఆరోపించారు. సెల్వపెరుందగై సొంతంగా ఎదిగేందుకే ఈ వ్యూహం పన్నారని, తద్వారా పార్టీ నష్టపోతుందని వాపోయారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ఈరోడ్డు తూర్పు నియోజకవర్గాన్ని డీఎంకేకి ఇవ్వడం ఎవ్వరికీ ఇష్టం లేదని, కానీ సెల్వపెరుందగై ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని డీఎంకేకు అప్పగించారన్నారు. ద్రావిడమోడల్ పాలన-కామరాజర్ పాలన ఒకటేనని సెల్వపెరుందగై చెబుతున్నారని, దీనిని తాము ఎలా అంగీకరిస్తామని ప్రశ్నించారు. అందుకే ఆయన్ని తొలగించి, కొత్త నేతను నియమించాలని డిమాండ్ చేశారు. అధిష్టానం నుంచి స్పందన వచ్చాక భవిష్యత్తుపై ఆలోచిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అసమ్మతి నేతలెవరు?

సెల్వపెరుందగై తిరుగుబావుటా ఎగురవేసిన వారిలో చెన్నై ఎంఎస్ ద్రవ్యం, సెంగం కుమార్, పెరంబలూర్ సురేష్, వేలూరు రామర్, నామక్కల్ సిద్ధిక్ తదితరులుండగా, వీరికి టీఎన్‌సీసీ మాజీ నేతలు అండగా వున్నట్లు తెలిసింది. సెల్వపెరుందగై చర్యలను వ్యతిరేకిస్తున్న కొంతమంది ఎంపీలు కూడా వారికి మద్దతిస్తున్నట్లు సమాచారం. వారి సహకారంతోనే ఈ 25 మంది ఢిల్లీ వెళ్లారు. బుధవారం ఉదయం కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీ అయిన నేతలు.. 4 పేజీల ఫిర్యాదు లేఖ అందించారు. అయితే వారికి ఖర్గే, రాహుల్ అపాయింట్‌మెంట్ మాత్రం ఇంకా లభించకపోవడం గమనార్హం.

కమల్‌తో ముత్తరసన్ భేటీ

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ 'మక్కల్‌నీది మయ్యం' (ఎంఎన్‌ఎం) అధినేత కమల్‌హాసన్‌తో భేటీ అయ్యారు. తేనాంపేటలోని ఎంఎన్‌ఎం పార్టీ కార్యాలయానికి వెళ్లిన ముత్తరసన్ అరగంటకు పైగా కమల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన కమల్‌కు ముందస్తు శుభాకాంక్షలు చెప్పినట్లు సమాచారం. అంతేగాక రాష్ట్రంలో అల్లుకుంటున్న రాజకీయాల తీరుపైనా ఇద్దరు నేతలు చర్చించికున్నట్లు తెలిసింది. ఈ భేటీలో ఎంఎన్‌ఎం ప్రధాన కార్యదర్శి అరుణాచలం కూడా పాల్గొన్నారు. ఓ కోర్సు చేసేందుకు విదేశాలకు వెళ్లిన కమల్. ఇటీవల చెన్నై చేరుకున్న విషయం తెలిసిందే. ఆ వెంటనే రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి వేర్వేరుగా కమల్‌ను కలిసి, వివిధ అంశాలపై చర్చించారు. కాగా జూలై నెలలో రాష్ట్రం నుంచి ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్న విషయం తెలిసిందే. అదే నెలలో జరుగనున్న ఎన్నికల్లో కమల్‌కు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కమల్ తమకు బేషరతుగా మద్దతు పలికినందుకు గౌరవసూచకంగా ఆ పదవి ఇవ్వాలని స్టాలిన్ భావిస్తున్నారు. అందుకే డీఎంకే నేతలు, మిత్రపక్షాల నేతలు కమల్‌ను కలిసి ముందస్తు శుభాకాంక్షలు చెబుతున్నట్లు తెలిసింది.



కమల్‌ను సత్కరిస్తున్న ముత్తరసన్

న్యాయవాదులపై పోలీసుల దాడి వ్యవహారం....

సీబీఐ కార్యాలయం ముట్టడి

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడ్‌వే సమీపంలోని మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో 2009లో న్యాయవాదులపై పోలీసులు దాడిచేసిన వ్యవహారంలో సీబీఐ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తూ సీబీఐ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టిన న్యాయవాదులను పోలీసులు అరెస్ట్ చేశారు. 2009 ఫిబ్రవరి 19న మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో ప్రవేశించిన పోలీసులు, న్యాయవాదులపై దాడిచేయడంతో పాటు వారి వాహనాలు కూడా ధ్వంసం చేశారు. ఈ దాడిలో పలువురు న్యాయవాదులు గాయపడ్డారు. అనంతరం ఈ దాడి కేసు సీబీఐ విచారణకు బదిలీ అయింది. ఘటన జరిగి 15 ఏళ్లు దాటినా సీబీఐ సక్రమంగా విచారణ చేపట్టలేదని, సంబంధిత పోలీసు అధికారులపై ఎలాంటి కేసులు నమోదుచేయలేదని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. ఈ దాడికి ఖండిస్తూ ప్రతి ఏడాది ఫిబ్రవరి 19వ తేది న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి ఆందోళన చేపడుతున్నారు. ఆందోళనల్లో భాగంగా ఈ ఏడాది సీబీఐ కార్యాలయం ముట్టడించనున్నట్లు హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రకటించింది. ఆ ప్రకారం, బుధవారం ఉదయం హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు జి.మోహన్‌కృష్ణన్, ఉపాధ్యక్షుడు అరివళగన్, కోశాధికారి జి.రాజేష్ నేతృత్వంలో న్యాయవాదులు హైకోర్టు ప్రాంగణంలోని ఆవిన్ పార్లర్ ఎదుట గుమిగూడారు. అనంతరం వారు సీబీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హైకోర్టు ప్రాంగణంలో ర్యాలీ చేపట్టారు. అప్పటికే ఆ ప్రాంతంలో మోహరించిన పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. అయినా న్యాయవాదులు సీబీఐ కార్యాలయం వైపు బయల్దేరడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. న్యాయవాదుల ర్యాలీ ఎన్ఎస్సీ బోస్ రోడ్డులో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అరెస్ట్ చేసిన న్యాయవాదులను రాయపురంలోని కల్యాణ మండపానికి తరలించి కొద్దిసేపటి అనంతరం విడుదల చేశారు.



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

సైదాపేటలో న్యాయవాదుల ధర్నా

ప్యారీస్: స్థానిక సైదాపేట మేజిస్ట్రేట్ కోర్టులో విధులు బహిష్కరించిన న్యాయవాదులు బుధవారం పోలీసులకు వ్యతిరేకంగా ధర్నాలో పాల్గొన్నారు సైదాపేట మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో గుముగూడిన న్యాయవాదులు పోలీసుల తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. సుమారు 300 మందికి పైగా న్యాయవాదులు విధులను బహిష్కరించి ఆందోళన నిర్వహించడంతో లిటిల్‌మౌంట్ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణి ఐటీ పార్క్ రీజియన్ పరిధిలో గురువారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. తరమణి సీఎస్ఐఆర్ రోడ్డులోని తరమణి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉదయం 10.30 గంటలకు జరుగనున్న సమావేశంలో, రీజియన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు పాల్గొని సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

25 నుంచి చదురగిరికి భక్తుల అనుమతి

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా ఒత్తిరాయిరుప్పు సమీపంలోని పశ్చిమ కనుమల్లో వెలసిన చదురగిరి సుందర మహాలింగం ఆలయానికి ఈ నెల 25 నుంచి 28వ తేది వరకు భక్తులను అనుమతించనున్నట్లు అటవీ శాఖ ప్రకటన విడుదల చేసింది. సముద్ర మట్టం నుంచి 4,500 అడుగుల ఎత్తున ఉన్న ఈ ఆలయానికి ప్రతినెలా పౌర్ణమి, అమావాస్య రోజుల్లో మూడు రోజులు, ప్రదోషం, మహాశివరాత్రి వేళల్లో నాలుగు రోజులు భక్తులను అనుమతిస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ నెల అమావాస్య, మహాశివరాత్రి, ప్రదోషం సందర్భంగా ఈ నెల 25 నుంచి 28వ తేది వరకు భక్తులను అనుమతించనున్నట్లు తెలిపారు. భక్తులు రాత్రి వేళ ఆలయం, కొండ ప్రాంతాల్లో బసచేసేందుకు అనుమతి లేదని, ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు.

26న పుట్లూరులో మహాశివరాత్రి వేడుకలు

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ సమీపం పుట్లూరులో ఉన్న అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రతి ఏడాది మహాశివరాత్రి వేడుకలు, మరుసటిరోజు అమావాస్య సందర్భంగా శ్మశానకొల్ల నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది వేడుకలు ఈ నెల 25న ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. 26వ తేది మహా అభిషేకం, సాయంత్రం అమ్మవారికి పొంగళ్ల నైవేద్యం చేయనున్నారు. రాత్రి మహాశివరాత్రి వేడుకలు, అమ్మవారు పుర వీధుల్లో విహారం తదితరాలు జరుగనున్నాయి. 27వ తేది అమ్మవారికి అభిషేకం, మధ్యాహ్నం శ్మశానకొల్ల వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మృతుల వారసులకు రూ.45 లక్షల చెల్లింపు

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ)లో విధి నిర్వహణలో మృతిచెందిన వారి వారసులకు రూ.45 లక్షలు అందజేశారు. అందుకోసం ఉద్యోగుల వేతనం నుంచి రూ.260 ఎంటీసీ జమచేసుకొని, మృతిచెందిన వారి కుటుంబాలకు అందజేసే పథకం 2023 నుంచి అమలులో ఉంది. ఆ ప్రకారం, విధి నిర్వహణలో మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు తలా రూ.7.50 లక్షల చొప్పున అందజేసినట్లు ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభు శంకర్ మంగళవారం అందజేసినట్లు ఎంటీసీ ప్రకటన విడుదల చేసింది.

వేసవి సెలవులు రైల్వే రిజర్వేషన్ ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రైల్వే రిజర్వేషన్ ప్రారంభమైంది. పాఠశాలలు, కళాశాలలకు వార్షిక పరీక్షలు ముగిసి ఏప్రిల్ మూడో వారం నుంచి సెలవులు ప్రారంభం కానున్నాయి. సెలవుల్లో అధిక శాతం మంది తమ తమ స్వగ్రామాలకు వెళుతుంటారు. ఈ నేపథ్యంలో, గతంలో రైళ్లలో ప్రయాణించేందుకు 120 రోజుల ముందుగా రిజర్వేషన్ చేసుకొనే సదుపాయం ఉండగా, ఆ గడువును 60 రోజులకు తగ్గించారు. దీంతో, ఏప్రిల్‌లో ప్ర యాణానికి రిజర్వేషన్ ప్రారంభమైంది. దక్షిణ జిల్లాలైన తిరునల్వేలి, కన్నియాకుమారి, పాండ్యన్, ఆనందపురం, గురువాయూర్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఏప్రిల్ రెండవ వారంలో ప్రయాణించేందుకు అధిక శాతం మంది రిజర్వేషన్ చేసుకుంటున్నారు. కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఇప్పటికే సెకండ్ క్లాస్ రిజర్వేషన్ వెయిటింగ్ లిస్ట్‌కు చేరుకోగా, ఏసీ బోగీల్లో ఖాళీలున్నట్లు అధికారులు తెలిపారు.

నెలాఖరులోగా పంట బీమా నగదు చెల్లింపు

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పంట బీమాకు సంబంధించిన రైతులకు చెల్లించాల్సిన పరిహారం ఈ నెలాఖరులోగా జమచేయనున్నట్లు మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... తుపానుతో నష్టపోయిన 5.18 లక్షల మంది రైతులకు రూ.498కోట్లు పరిహారం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. పరిహారం అందజేసేందుకు చేపట్టాల్సిన పనులు పూర్తిచేసి, ఈ నెలఖారులోపు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తామని, ఈ విషయమై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మరాదని మంత్రి విజ్ఞప్తి చేశారు.

'ఎయిర్ ఏసియా' తగ్గింపు ఆఫర్

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి కౌలాలంపూర్, బ్యాంకాంక్, పుకెట్ నగరాలకు వెళ్లేందుకు 'ఎయిర్ ఏసియా' సంస్థ ఛార్జీలో తగ్గింపు ఆఫర్ ప్రకటించింది. ప్రయాణికులు ఈ నెల 23వ తేదిలోగా రూ.6,599 చెల్లించి 'వన్ వే ట్రిప్' వినియోగించుకోవచ్చు. బుక్ చేసుకున్నవారు జూలై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 15వ తేది వరకు ఈ ఆఫర్‌లో ప్రయాణించవచ్చు. మరిన్ని వివరాలకు airasia.com అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

తిరువళ్లూరు వద్ద మురుగన్ ఆలయంలో సొరంగమార్గం

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం తిరువళ్లూరు సమీపం పట్టరైపెరుంబుదూరులోని మురగన్ ఆలయంలో పురావస్తు పరిశోధకులు జరిపిన తవ్వకాల్లో ప్రాచీన సొరంగ మార్గం బయల్పడింది. చెన్నై - తిరుపతి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇటీవల రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో పట్టరైపెరుంబుదూరులో ఉన్న 9, 10 శతాబ్దాల నాటి సుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని కూల్చివేయనున్నట్లు రహదారుల శాఖ అధికారులు ప్రకటించారు. అత్యంత ప్రాచీనమైన ఆలయం కనుక దానిని కూల్చేందుకు స్థానికులు అంగీకరించలేదు. ఆ ఆలయంలో సొరంగ మార్గం ఉందని తమ తాతముత్తాతలు చెబుతుండేవారని ఆ ప్రాంతంలోని వృద్ధులు వెల్లడించారు. వీరి మాటలను రహదారి విస్తరణ పనులు జరుపుతున్న అధికారులు పట్టించుకోలేదు. అదే సమయంలో ఈ విషయం పురావస్తు పరిశోధక విభాగం అధికారుల దృష్టికి వెళ్ళింది. స్థానికులు కొందరు ఇక్కడి ఆలయ గర్భాలయం నుండి పది కిలోమీటర్ల దూరంలోని తిరువలంగాడు నటరాజస్వామి ఆలయం వరకు సొరంగమార్గం ఉండేదని తమ పూర్వీకులు చెబుతుండేవారని, ఆ విషయమై పరిశోధనలు జరపాలని పురావస్తు పరిశోధక శాఖ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో గత మూడురోజులు రహదారులు శాఖ, పురావస్తు పరిశోధక విభాగం అధికారులు జరిపిన తవ్వకాల్లో అందరూ అనుకున్నట్లే ఆ ఆలయం వద్ద ప్రాచీన కాలం నాటి సొరంగమార్గం బయల్పడింది. ఆ సొరంగ మార్గం 1.5 మీటర్ల వెడల్పు, ఏడడుగుల లోతు ఉందని అధికారులు చెప్పారు. ఇక్కడి మురుగన్ ఆలయం 9, 10వ శతాబ్దాల కాలానికి చెందినదై ఉండటం ఆలయ ఆస్తుల పత్రాలు, స్వామివారి ఆభరణాలు, విగ్రహాలను భద్రపరిచేందుకు గర్భాలయం నుంచి ఈ సొరంగ మార్గాన్ని తవ్వి ఉంటారని తెలిపారు. ఈ సొరంగ మార్గం ఎంతదూరం వరకు ఉంటుందన్న విషయాన్ని తెలుసుకునేందుకు తగిన భద్రతా పరికరాలు సమకూర్చుకున్న తరువాత ఆ సొరంగంలో వెళ్ళాల్సి ఉంటుందని, ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం నుండి తదుపరి ఉత్తర్వులు రావాల్సి ఉందని పురావస్తు పరిశోధక విభాగం అధికారులు తెలిపారు.



పట్టరైపెరుంబుదూరు ఆలయం తవ్వకాల్లో బయల్పడిన సొరంగమార్గం

హాజరు తక్కువగా ఉంటే పరీక్షలకు అనుమతిస్తారా?

● మద్రాసు హైకోర్టు

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హాజరు తక్కువగా ఉన్న విద్యార్థుల్ని పరీక్షలకు అనుమతించడం సరైన పద్ధతి కాదని మద్రాసు హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. హాజరు తక్కువగా ఉండడంతో విశ్వవిద్యాలయ పరీక్షలకు అనుమతించమనే ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ, ఓ విద్యార్థి మద్రాసు హైకోర్టులో అప్పీలు పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ బుధవారం విచారణకు రాగా న్యాయస్థానం... హాజరు తక్కువగా ఉన్న విద్యార్థులకు పరీక్షలకు అనుమతిస్తే సక్రమంగా హాజరవుతున్న విద్యార్థులను అవమానించడమేనని పేర్కొంది. హాజరు తక్కువగా ఉన్న విద్యార్థులను పరీక్షలకు అనుమతించడం సరైన పద్ధతి కాదంటూ వ్యాఖ్యానించింది. తగిన రుసుము చెల్లించి మళ్లీ కోర్సు పూర్తి చేసేందుకు విద్యార్థి ఇష్టపడితే అనుమతించాలని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌కు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ, విద్యార్థి దాఖలుచేసిన అప్పీలు పిటిషన్ తోసిపుచ్చుతున్నట్లు ప్రకటించింది.

గ్రీవెన్స్ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించండి

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను విచారించి సత్వరం పరిష్కరించాలని కమిషనర్ సబంధిత స్టేషన్ల సిబ్బందికి ఆదేశించారు. గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్, నగర ప్రజల సమస్యలు తెలుసుకొనేందుకు ప్రతి బుధవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. కమిషనర్ అరుణ్ స్వయంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 24 వినతిపత్రాలు స్వీకరించారు.



సమస్యలు తెలుసుకుంటున్న నగర పోలీస్ కమిషనర్ అరుణ్

రాష్ట్రంలో త్రిభాషా విధానం అవసరమే

● సీనియర్ నటుడు శరత్‌కుమార్

ప్యారీస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వివిధ కులాలు, మతాలు, భాషలు మాట్లాడే ప్రజలు అధికంగా నివసిస్తున్న తమిళనాడులో త్రిభాషా విధానం అవసరమేనని సీనియర్ నటుడు శరత్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలలో కేంద్రప్రభుత్వం ప్రకటించిన నూతన విద్యా విధానంలో ఎక్కడా హిందీ తప్పనిసరి చేయలేదని, వారివారి మాతృభాషకు ప్రాధాన్యత కల్పిస్తూ, ఆయా రాష్ట్రాల్లో ప్రధానమైన భాషను అవసరమైతే విద్యార్థులు చదువుకోవచ్చని స్పష్టంగా ఉందని తెలిపారు. ధనికవర్గాల పిల్లలు మాత్రమే అన్ని భాషల్లో చదువుకుంటున్నారని, అయితే ఒక తమిళనాడులో మాత్రమే అన్ని పాఠశాలల్లో ద్విభాషా విధానం ఉండాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. మాతృభాషతో పాటు ఇతర భాషల్లో కూడా చదువుకున్నప్పుడే విద్యార్థులు ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో ఉన్నత పదవులు అలంకరించి తమ ప్రతిభ చాటుతున్నారని శరత్‌కుమార్ తెలిపారు.

శ్రీలంక నావికాదళానికి నిరసనగా జాలర్ల సమ్మె

● నాగపట్టినం జిల్లాలో ఆగిన 5వేల పడవలు

ప్యారీస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపలవేటకు వెళ్లే తమిళ జాలర్ల అరెస్టు, పడవల స్వాధీనం చేసుకుంటున్న శ్రీలంక నావికా దళం వైఖరిని ఖండిస్తూ, నాగపట్టినం జిల్లా జాలర్లు బుధవారం సమ్మెబాట పట్టారు. జిల్లావ్యాప్తంగా సుమారు 5వేలకు పైగా పడవలను తీరంలో నిలిపి మత్స్యకారులు శ్రీలంకకు తమ నిరసన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కారైకాళ్ జాలర్లపై కాల్పులు జరిపి శ్రీలంక నావికా దళ సిబ్బంది అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ గత తొమ్మిది రోజులుగా కారైకాళ్ జిల్లా జాలర్లు సమ్మెలో పాల్గొంటున్నారు. వీరికి మద్దతు ప్రకటించిన నాగపట్టినం జిల్లా జాలర్లు తాము కూడా శ్రీలంకకు వ్యతిరేకంగా నిర్వదిక సమ్మెలో పాల్గొంటున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు జిల్లాలోని నాగపట్నం, అక్కరపేట, కీచంకుప్పం, సెరుదూర్ తదితర 50కి పైగా జాలర్ల గ్రామాలకు చెందిన మత్స్యకారులు చేపల వేటను బహిష్కరించారు. కడలిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులను శ్రీలంక ప్రభుత్వం అరెస్ట్ చేయకుండా, అలాగే దాడులకు పాల్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని నాగపట్నం జిల్లా జాలర్లు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

భార్య శీలాన్ని శంకించిన ప్రబుద్ధుడు

● ఇద్దరు పిలల్ని హతమార్చిన కసాయి తండ్రి

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఆత్తూరు సమీపం కృష్ణాపురం గ్రామంలో భార్యశీలాన్ని శంకించిన భర్త తన ఇద్దరు పిల్లలను కత్తితో దారుణంగా హత్య చేశాడు. అంతటితో ఆగకుండా భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి పక్కింటిలో దాగిన ఆ కసాయిని అరెస్టు చేశారు. కృష్ణాపురంలో అశోక్‌కుమార్ (42), తవమణి (38) అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరికి విద్యారాణి (13), అరుళ్‌కుమారి (13) అనే ఇద్దరు కుమార్తెలు, అరుళ్ ప్రకాష్ (5) అనే కుమారుడున్నాడు. అశోక్‌కుమార్ నైవేలిలో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. అతడికి తాగుడు అలవాటు ఉంది. వారానికొకసారి ఇంటికి వచ్చి వెళుతుండేవాడు. ఆ మేరకు మంగళవారం రాత్రి పీకలదాకా తాగి అశోక్‌కుమార్ ఇంటికి రాగా తవమణి అతడితో గొడవపడింది. అదే సమయంలో అశోక్‌కుమార్ తాగిన మైకంలో తవమణి శీలాన్ని శంకిస్తూ కొడుకు తనకు పుట్టలేదంటూ తవమణితో గొడవపెట్టుకున్నాడు. బుధవారం వేకువజాము వరకూ భర్తతో గొడవపడి అలసిపోయిన తవమణి, ఆమె పిల్లలు ఓ గదిలో పడుకున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం మరింత తాగి ఇంటికి చేరుకున్న అశోక్‌కుమార్ వేటకొడవలితో నిదురపోతున్న భార్యా, ముగ్గురు పిల్లలపై దాడి జరిపాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యారాణి, అరుళ్ ప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందారు. తవమణి, అరుళ్‌కుమారి తీవ్రంగా గాయపడ్డారు. నలుగురు మృతి చెందారని అనుకున్న అశోక్‌కుమార్ వేటకొడవలితోనే పక్కింటో దూరాడు. అతడిని చూసిన ఆ ఇంటిలోనివారు కేకలు వేశారు. చుట్టుపక్కలివారంతా లేచి అశోక్‌కుమార్ ఇంటిలోకి వెళ్లగా విద్యారాణి, అరుళ్ ప్రకాష్ విగత జీవులై పడి ఉండటాన్ని పక్కనే కొన ఊపిరితో ఉన్న తవమణి, అరుళ్‌కుమారిని చూసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని పక్కింటిలో దాగిన అశోక్‌కుమార్‌ను అరెస్టు చేసి, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

నీటమునిగి ఇద్దరు బాలికల మృతి

వేళచ్చేరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లాలో నీటమునిగి ఇద్దరు బాలికలు మృతిచెందారు. ఇనయాంగుడి సమీపం అళిమదురై గ్రామంలో ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సౌమ్య (8), కృష్ణిక (4) చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం పాఠశాల సమీపంలోని కుంటలో ఆడుకొనేందుకు వెళ్లిన ఇద్దరు బాలికలు నీటమునిగి మృతిచెందారు. పాఠశాల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉన్నందునే బాలికలు పాఠశాల సమయంలో గుంట వద్ద వెళ్లి మృతిచెందారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు.

సీఎం దిగ్భ్రాంతి...

శివగంగ జిల్లాలో నీటమునిగి ఇద్దరు బాలికలు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... బాలికల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబాలకు తలా రూ.3 లక్షలు అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు.



కార్మికులను రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బాణసంచా కర్మాగారంలో పేలుడు

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు

వేళచ్చేరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శివకాశి సమీపం పొదురెడ్డియాపట్టిలో ఉన్న బాణసంచా కర్మాగారంలో సంభవించిన పేలుడులో ఒకరు మృతిచెందారు. శివకాశికి చెందిన రమేష్ పొదురెడ్డియాపట్టిలో బాణసంచా తయారీ కర్మాగారం నిర్వహిస్తున్నారు. ఈ కర్మాగారంలో సుమారు 40 గదుల్లో 80 మంది కార్మికులు పనిచేస్తున్నారు. బుధవారం సాయంత్రం బాణసంచా తయారీకి మిశ్రమం కలుపుతుండగా భారీ శబ్దంతో పేలి మంటలు చెలరేగాయి. పేలుడు దాటికి ఒక గది పూర్తిగా నేలమట్టమైంది. సమాచారం అందుకున్న శివకాశి అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేశారు. ఈ ఘటనలో ఓ కార్మికుడు మృతిచెందగా, మరో కార్మికుడికి 20 శాతం గాయాలయ్యాయి. అతడిని శివకాశి ప్రభుత్వాసుపత్రికి తరలించిన మారనేరి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పార్టీ విశ్వాసులంతా నా వెంటే

● అందరూ కలిస్తేనే విజయం: ఓపీఎస్

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్టీ పట్ల అచంచల విశ్వాసమున్న నేతలు, కార్యకర్తలంతా తన వెంటే వున్నారని అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన సేలంలో మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ నేతలంతా కలిసి పని చేస్తేనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే విజయం సాధిస్తుందని, లేనిపక్షంలో మళ్లీ పరాజయం తప్పదన్నారు. పార్టీలో కలహాల వల్లే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు చీలిపోయాయని, అదే పార్టీ ఓటమికి కారణమైందని విశ్లేషించారు. ఇటీవల పార్టీ అధినాయకత్వం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ తనలానే ఆది నుంచి పార్టీ కోసం పని చేసిన వ్యక్తి అని కితాబునిచ్చారు. మరో మాజీ మంత్రి ఉదయమార్ తనపై చేస్తున్న విమర్శలకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని ఓపీఎస్ పేర్కొన్నారు.

జూన్ నుంచి వేళచ్చేరి-సెయింట్ థామస్ ఎమ్మార్టీఎస్ సేవలు

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మధ్య జూన్ నుంచి ఎమ్మార్టీఎస్ రైళ్లను ప్రారంభించనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. 2008లో రూ.495 కోట్లతో వేళచ్చేరి నుంచి సెయిట్ థామస్ మౌంట్ వరకు 5 కి.మీ మేర రైలు మార్గం పనులు ప్రారంభమయ్యాయి. 4.5 కి.మీ వరకు 167 పిల్లర్ల నిర్మాణం పూర్తికాగా, ఆదంబాక్కం తిల్లైగంగానగర్ ప్రాంతంలో భూసేకరణలో ఏర్పడిన సమస్యల కారణంగా ఈ పనుల్లో జాప్యం చేసుకుంది. న్యాయస్థానం ఉత్తర్వులతో భూసేకరణ సమస్యకు పరిష్కారం లభించగా, ఆ మార్గంలో 70 శాతం పనులు పూర్తయ్యాయని, జూన్ నుంచి వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మధ్య ఎమ్మార్టీఎస్ రైళ్ల సేవలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

అమిత్‌షాకు నల్లజెండాలతో నిరసన

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ రానున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు నల్లజెండాలతో నిరసన తెలుపాలని అఖిలపక్ష పార్టీలు నిర్ణయించాయి. కోవై గాంధీపురంలోని ద్రావిడర్ కళగం కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో డీఎంకే మిత్రపక్షాల నేతలు పాల్గొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వని కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ సమావేశంలో తీర్మానం చేశారు. అలాగే నూతన జాతీయ విద్యా విధానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కోర్కెలతో ఈ నెల 25న కోవై రానున్న కేంద్ర మంత్రి అమిత్ షాకు ప్రజాస్వామ్యబద్ధంగా నల్లజెండాలతో నిరసన తెలపాలని సమావేశంలో నిర్ణయించారు.

లోకాయుక్త ఛైర్మన్‌గా హైకోర్టు మాజీ న్యాయమూర్తి రాజమాణిక్యం

వేళచ్చేరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు లోకాయుక్త ఛైర్మన్‌గా మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి రాజమాణిక్యం నియమితులయ్యారు. ప్రభుత్వ ఉద్యోగులపై వచ్చిన అవినీతి ఆరోపణలను లోకాయుక్త విచారిస్తోంది. స్వతంత్రంగా పనిచేసే ఈ సంస్థ ఛైర్మెన్‌గా నియమితులైన రాజమాణిక్యం ఇప్పటికే ఇంచార్జి ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. అలాగే, నామక్కల్ జిల్లా వినియోగదారుల ఫిర్యాదుల కమిషన్ ఛైర్మన్ రామరాజ్, ఇన్‌కమ్‌టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, న్యాయవాది ఆర్ముమోహన్ అలంగమణి నాన్ జ్యుడీషియల్ సభ్యులుగా నియమితులయ్యారు.

● రూ.20 లక్షలు దోచుకున్న కేసు...

ఇద్దరు ఎస్ఐలకు బెయిల్ నిరాకరణ

ప్యారీస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక థౌజెండ్ లైట్స్ నియోజకవర్గంలో రూ.20లక్షలు దోచుకున్న కేసులో పట్టుబడిన ఇద్దరు ఎస్ఐలకు మద్రాస్ సెషెన్స్ కోర్టు బెయిల్ నిరాకరించింది. ట్రిప్లికేన్ ప్రాంతంలో డిసెంబరు 15వ తేదీ మహ్మద్ గౌస్ అనే ప్రవేటు కంపెనీ ఉద్యోగిని బెదిరించి అతడి వద్ద రూ.20లక్షలు దోచుకున్న రాజాసింగ్, సన్నిలాయడ్ అనే ఎస్సైలను అరెస్టు చేశారు. వీరికి సహకరించిన దామోదరన్, ప్రదీప్, ప్రభు అనే వారిని కూడా అరెస్టు చేసి పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ న్యాయమూర్తి కార్తికేయన్ ముందుకు రాగా అరెస్టయిన ఎస్సై తరుపు న్యాయవాదుల వాదన విన్న అనంతరం ఈ పోలీసు అధికారుల పేర్లపై ఇంతకు ముందే వేర్వేరు ప్రాంతాల్లో నమోదైన కేసులు కూడా ఇంకా విచారణ దశలోనే ఉన్నందున వీరికి బెయిల్ మంజూరు చేయడం కుదరని తీర్పునిచ్చారు.

ఆవడి కర్మాగారానికి రెండో సారి బాంబు బెదిరింపు

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి హెచ్‌వీఏఫ్ రోడ్డు సమీపంలోని యుద్ధ ట్యాంకుల తయారీ కర్మాగారానికి రెండో సారి బాంబు బెదిరింపులకు పాల్పడిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ప్రాంతంలోని కర్మాగారంలో బాంబు ఉంచినట్లు ఈ నెల 14న ఈ-మెయిల్ ద్వారా బెదిరింపు వచ్చింది. కర్మాగారం అధికారుల సమాచారంతో ఆవడి ట్యాంక్ పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్‌తో అక్కడకు చేరుకొని క్షుణ్ణంగా గాలించి, బాంబు బెదిరింపు ఫేక్ అని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో, మంగళవారం మళ్లీ ఈ-మెయిల్‌లో వచ్చిన మెసేజ్‌లో 'నేను పెట్టిన బాంబు అక్కడే ఉందని, ఈ రోజు అర్ధరాత్రి బాంబు పేలుతుందని' ఉంది. అధికారుల సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు కర్మాగారం, ప్రాంగణాలను గాలించినా ఎలాంటి పేలుడు పదార్థం లభించలేదు. దీంతో, బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిన చిరునామా కోసం పోలీసులు విచారిస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

● రూ.5 లక్షల ఆస్తి నష్టం

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో మంగళవారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం జరుగగా, టెలిఫోన్ సేవలకు అంతరాయం కలిగింది. తిరువణ్ణామలై బస్టాండ్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని గంట సేపు శ్రమించి మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో కంప్యూటర్లు సహా పలు విలువైన పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు చేపట్టిన ప్రాథమిక విచారణలో... యూపీఎస్‌లో మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది.

మినీ లారీ ఢీకొని మేకల మృతి

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా తిట్టక్కుడి సమీపం రామనత్తం వద్ద బుధవారం ఉదయం అదుపు తప్పిన మినీ లారీ మేకల మందపై దూసుకెళ్లటంతో 30 మేకలు మృతి చెందాయి. అరియాంకుడికి చెందిన మురుగేశన్ అనే మేకల కాపరి ఆ రహదారిలో మేకలను తోలుకెళ్తుండగా మినీ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మేకలు మృతి చెందాయి. మురుగేశన్ గాయపడ్డాడు. లారీ డ్రైవర్ కార్తీక్ (28)ని అరెస్టు చేసి పోలీసులు విచారణ జరుపుతున్నారు.



లారీ ఢీకొనడంతో మృతి చెందిన మేకలు

లైంగిక వేధింపుల్లో చిక్కిన హెచ్ఎం అనుమానాస్పద మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధానోపాధ్యాయుడు అనుమానాస్పదంగా మృతిచెందడం కలకలం రేపింది. రామనాథపురం జిల్లా సాయల్‌కుడి సమీపం ఓ గ్రామంలోని పాఠశాలలో సేర్ అయూబ్‌ఖాన్ (56) ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన కుటుంబంతో సాయల్‌కుడి సమీపంలోని మారియూర్‌లో నివాసం ఉంటున్నాడు. అయూబ్ ఖాన్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరుకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన అధికారులు, పోలీసులు మంగళవారం పాఠశాలకు వెళ్లి అయూబ్ ఖాన్, విద్యార్థులు, టీచర్లను విచారించి, బుధవారం విచారణకు హాజరుకావాలని అయూబ్ ఖాన్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో, రాత్రి భోజనం అనంతరం తన గదికి వెళ్లిన ఆయన, బుధవారం ఎంతవరకు బయటకు రాకపోవడంతో ఆయన భార్య గదిలోకి వెళ్లి చూడగా, ఆయన అచేతనంగా పడి ఉండడం గమనించి విలపించింది. సమాచారం అందుకున్న సాయిల్‌కుడి పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామనాథపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

286 మద్యం సీసాల స్వాధీనం

● తండయార్‌పేట వ్యక్తి అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ మద్యం దుకాణాలు పనిచేయని రోజుల్లో అధిక ధరకు విక్రయించేందుకు ఇంట్లో దాచిన 286 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఉత్తర చెన్నై పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. స్థానిక తండయార్‌పేట అమ్మని అమ్మాళ్ గార్డెన్‌లోని ఓ ఇంట్లో టాస్మాక్ మద్యం సీసాలను దాచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వాషర్‌మెన్‌పేట పోలీసులకు సమాచారం తెలిసింది. అప్రమత్తమైన పోలీసులు మంగళవారం సంబంధిత ప్రాంతంలో నిఘా వేసి ఓ ఇంటిముందు అనుమానాస్పదంగా నిలబడివున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆ ఇంట్లో తనిఖీ చేయగా బస్తాల్లో సుమారు 286పైగా మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని దాచిన గంగాధరన్ (45)అనే వ్యక్తిని అరెస్ట్ చేసి జార్జ్ టౌన్ కోర్టులో హాజరుపరిచి తీర్పు అనంతరం పుళల్ జైలుకు తరలించారు.




ఇద్దరు యువకుల హత్య.. నిందితుడి అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా వత్తలగుండు సమీపం కొన్నంపట్టి ప్రాంతంలో పాత కక్షల కారణంగా ఇద్దరు యువకులను దారుణంగా హత్యచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొన్నంపట్టి గ్రామానికి చెందిన అలగుమలై (55), మనోహరన్ (52) భవన నిర్మాణ పనులకు వెళ్లేవారు. అదే గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ (22)తో కలిసి వీరు మద్యం సేవించిన సమయంతో చోటుచేసుకున్న వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. ఇందులో నవీన్‌కుమార్ కత్తితో దాడి చేయడంతో అలగుమలైకు తీవ్రగాయాలయ్యాయి. వీరప్పన్‌పట్టి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని హెచ్చరించి వదిలిపెట్టారు. దీంతో అలగుమలై, మనోహరన్‌లపై ఆగ్రహం చెందిన నవీన్‌కుమార్ మారణాయుధాలతో దాడికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో వారు అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న పోలీసులు జంట హత్యలకు పాల్పడిన నవీన్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

మూనారులో కాలేజీ బస్సు బోల్తా

● ఇద్దరు విద్యార్థినుల సహా ముగ్గురి మృతి

చెన్నై, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం ఇడుక్కి సమీపం ఎకో పాయింట్ వద్ద కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోవిల్‌కు చెందిన కాలేజీ బస్సు బోల్తాపడటంతో ఇద్దరు విద్యార్థినులు సహా ముగ్గురు మృతి చెందగా 20 మంది గాయపడ్డారు. ఆ కళాశాలకు చెందిన విద్యార్థులు, లెక్చరర్లు సహా 45 మంది మునారుకు బస్సులో విహారయాత్ర కోసం వెళ్ళారు. ఎకో పాయింట్ వద్ద బస్సు అదుపుతప్పి బోల్తాపడటంతో ఓ విద్యార్థిని, లెక్చరర్ తీవ్రంగా గాయపడి ఆ అక్కడికక్కడే మరణించారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించగా, ఓ విద్యార్థిని మృతిచెందింది.





రాజగోపుర కలశాలకు సంప్రోక్షణ చేస్తున్న శైవాగమపండితులు, ప్రధానార్చకులు - కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నేత్రపర్వంగా వయలూరు ఆలయ మహాకుంభాభిషేకం

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం మురుగప్పెరుమాన్ వెలసిన సప్తమ దివ్యక్షేత్రం, శైవభక్త శిఖామణి అరుణగిరినాథర్‌ను అనుగ్రహించి ముక్తి ప్రసాదించిన వయలూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో 17 యేళ్ల తర్వాత బుధవారం ఉదయం మహాకుంభాభిషేక వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. గత యేడాది ఈ ఆలయ జీర్ణోద్ధరణపనులకు రూ.5కోట్ల మేర నిధులు కేటాయించారు. దాంతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చురుకుగా సాగాయి. ఆలయంలోని అన్ని సన్నిధులు, గోపురాలు, విమానాలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. ఇటీవలే ఈ పనులన్నీ ముగియడంతో మహాకుంభాభిషేక వేడుకలు ఈ నెల 14న గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. మంగళవారం వేకువజాము చతుర్థ కాల యాగపూజ, సాయంత్రం పంచమ కాల యాగపూజ జరిగాయి. బుధవారం ఉదయం 7.30 గంటలకు యాగశాల నుండి పవిత్రనదీ జలాలున్న కలశాల ఊరేగింపు ప్రారంభమైంది. పిళ్ళయార్‌పట్టి పిచ్చై శివాచార్యుల పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకులు, శైవాగమ పండితులు పవిత్ర జలాలను ఆలయ రాజగోపురంపైన, వివిధ సన్నిధుల్లో విమానాల వద్దకు తీసుకెళ్లారు. మంగళవాయిద్యాలు, మంత్రోచ్చారణ, 'హరోం... హరా.. మురుగయ్యా.. వయలూరు మురుగప్పెరుమానే' అంటూ వేలాదిమంది భక్తుల నినాదాల నడుమ కలశాలపై మహాసంప్రోక్షణ నిర్వహించారు. రాజగోపుర కలశాలు, వివిధ దేవతామూర్తుల సన్నిధులపైన పవిత్రజలాలను చల్లిన తర్వాత ప్రధానార్చకులు కలశాలలో మిగిలిన జలాలు భక్తులపై చల్లారు. మధ్యాహ్నం 12.15 గంటలకు మహాభిషేకం, మహాదీపారాధన, ప్రసాద వితరణ జరిగాయి. హిందూ దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కళ్యాణి, శ్రీరంగం ఆర్డీవో శీనివాసన్, నిర్వాహణాధికారి అరుణ్ పాండ్యన్, శాసనసభ్యుడు పళనియాండి, దేవాదాయ అధికారులు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు. రాత్రి స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.



ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న రాష్ట్ర ఉన్నతవిద్యామండలి సభ్యులుగా ఎంపికైన డాక్టర్ కే పన్నీర్‌సెల్వం, మురళీధరన్, డాక్టర్ ఎన్ చంద్రశేఖర్, మంత్రి కోవి చెళియన్



తీవ్ర అస్వస్థతకు గురై చెన్నైలోని ఇంటిపట్టునే విశ్రాంతి తీసుకుంటున్న మనిదనేయ మక్కల్ కట్చి నేత ఎంహెచ్ జవాహిరుల్లాను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి దామో అన్బరసన్, ఎమ్మెల్యే ఎంకే మోహన్



రాష్ట్ర రాజకీయాల్లోకి మరింత తారాగణం తరలిరానుందా?.. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో సినీ వెలుగులు కాంతులీనడం ఖాయమా?.. ఓటర్ల ముంగిట తారలు తళుక్కుమనడం తథ్యమా?.. అవుననే అంటున్నాయి రాజకీయ, సినీ వర్గాలు. ఇందుకోసం ఇప్పటి నుంచే సన్నాహాలు, ఒప్పందాలు, మాటామంతీ జరుగుతున్నట్లు ఆయా వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి.

రాజకీయాల్లో తారాబలం

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో సినీ వెలుగులు ఖాయం

ఓటర్ల ముంగిటకు తారల తళుకులు

ఇప్పటి నుంచే సన్నాహాలు

ఆదినుంచి రాష్ట్ర రాజకీయాలపై సినీ రంగ ప్రభావం గణనీయంగా వుంది. నాటి ఎంజీఆర్ నుంచి నేటి స్టాలిన్ వరకు ఎంతోమంది ముఖ్యమంత్రులు సినీతెరపై వెలుగులీనినవారే. కథానాయకుడిగా ఎంజీఆర్ తమిళ ప్రేక్షకులపై చెరగని ముద్ర వేయగా, కథా రచయితగా, మాటల మాంత్రికుడిగా మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తనదైన శైలిని చాటారు. కథా నాయకిగా జయలలిత దక్షిణభారతదేశ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. ఎంజీఆర్ మరణానంతరం జరిగిన పరిణామాల్లో సీఎం పీఠంపై కూర్చున్న జానకి రామచంద్రన్ కూడా సినీ రంగానికి చెందిన వారే కావడం విశేషం. ఐదుదశాబ్దాల పాటు వీరు ముఖ్యమంత్రులుగా రాష్ట్ర రాజకీయాలను శాసించారన్నది వాస్తవం. అందుకే ఇప్పటికీ డీఎంకే, అన్నాడీఎంకేలు కరుణ, ఎంజీఆర్, జయలలిత పేర్లు లేకుండా ప్రచారం చేసే సాహసానికి పూనుకోవు. అనంతర కాలంలో రాధారవి, ఎస్వీ శేఖర్, టి.రాజేందర్, కార్తీక్, శరత్‌కుమార్, ఖుష్బూ, గౌతమి, నమిత వంటి ఎంతోమంది నటీనటులు రాజకీయాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి ఉదయనిధి సైతం సినీతెరపై కథానాయకుడిగా తనకంటూ ప్రత్యేకంగా అభిమానుల్ని సంపాదించుకున్నవారే. ఇక సూపర్‌స్టార్ రజనీకాంత్ కూడా రాజకీయాల్లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమై, చివరిక్షణంలో మనసు మార్చుకున్నారు. అగ్రనటుడు కమల్‌హాసన్ 'మక్కల్ నీది మయ్యం' పార్టీని స్థాపించి గత అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయ ప్రభావం చూపారు. మునుముందు ఆయన మరింత క్రియాశీలకంగా వ్యవహరించేందుకు అడుగులు పడుతున్నాయి.

విజయ్ రాకతో మరింతమంది దృష్టి!

ఎంజీఆర్, జయలలితల తరువాత వెండితెరపై అగ్రతారగా వెలిగిన విజయ్ కొన్నేళ్లపాటు తర్జనభర్జనల తరువాత ఎట్టకేలకు గత ఏడాది రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పేరుతో పార్టీని స్థాపించడంతో పాటు ముఖ్యమంత్రి పీఠం రేస్‌కు సిద్ధమవుతున్నారు. అయితే గతంలో పరిస్థితి ఎలా వున్నా విజయ్ రాక తరువాత పలువురు సినీ తారలు కూడా రాజకీయాల్లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. నడిగర్ సంఘంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఇద్దరు యువ నటులతో పాటు కొంతమంది సీనియర్ నటులు కూడా రాజకీయాల్లోకి వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. అయితే ఎవరు ఏ పార్టీలో చేరతారన్నదానిపై స్పష్టత రావాల్సివుంది. నటీనటుల ఆకర్షణలో బీజేపీ, డీఎంకే ముందు వరుసలో ఉండగా, టీవీకే పార్టీ చాపకిందనీరులా పలువురు సినీనటులతో చర్చిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే విజయ్ రాష్ట్రవ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఆ సమయంలోనే ఆయా నటులు కూడా టీవీకే సభ్యత్వం తీసుకోవడంతో పాటు విజయ్‌తో కలిసి పర్యటనల్లో పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరీ ముఖ్యంగా ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిశోర్ టీవీకేకు సలహాదారుడిగా నియమితులైనట్లు మీడియాలో కథనాలు వచ్చినప్పటి నుంచి తమకు సినీ ప్రముఖుల నుంచి ఫోన్ల తాకిడి పెరిగిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. సినీ దర్శకుడిగా వ్యవహరించి, రాజకీయాల్లోకి వచ్చాక, నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో మీడియాలో కనిపించే ఒక వ్యక్తి చేతిలో మోసపోయిన ఓ నటి కూడా విజయ్ పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇక విజయ్ పార్టీలో చేరతారంటూ తనపై రేగిన ప్రచారాన్ని ఇప్పటికే నటి త్రిష ఖండించారు. కానీ ఆమె తమ పార్టీకి మద్దతుగా ప్రచారం చేయడం ఖాయమని టీవీకే వర్గాలు చెబుతున్నాయి. ఆమెతో పాటు మరో ప్రముఖ హీరోయిన్ కూడా ప్రచారానికి వస్తారని, దీనిపై ఇప్పటికే చర్చలు కూడా జరిగాయని ఆ వర్గాలు వ్యాఖ్యానించాయి. ఈ విషయం బయటకు పొక్కడంతో టీవీకే సినీ ప్రచారాన్ని దీటుగా ఎదుర్కొనేందుకు అనువుగా పలు పార్టీలు కూడా సినీతారల కోసం అన్వేషిస్తున్నాయి. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నటీనటుల ప్రభావం అధికంగా కనిపించే సూచనలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే ఓటర్ల ముంగిటకే సినీ తారలు తళుక్కుమనడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే ఎంజీఆర్ చేతుల్లో పుట్టి, జయ ఒడిలో పెరిగిన అన్నాడీఎంకే మాత్రం సినీప్రముఖుల్ని ఆకర్షించే రేసులో వెనుకబడినట్లు కనిపిస్తుండడం శోచనీయం.



ఎద్దును అదుపుచేస్తున్న క్రీడాకారులు

రంకేసిన పోట్లగిత్తలు పోటీపడిన యువకులు

- కోలాహలంగా జల్లికట్టు పోటీలు

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నత్తం సమీపం పుగయిలైపట్టి గ్రామంలోని సెయింట్ సెబాస్టియన్, సెయింట్ శాంతియకాపర్ ఆలయ వేడుకల్లో భాగంగా బుధవారం జల్లికట్టు పోటీలు కోలాహలంగా సాగాయి. ఈ పోటీల్లో 786 ఎద్దులు బరిలో నిలవగా, వాటిని అదుపు చేసేందుకు 392 మంది యువకులు సిద్ధమయ్యారు. పేర్ల నమోదు ఆధారంగా వరుస నెంబర్ల ప్రకారం ఎద్దులు, యువకులను పోటీల్లో అనుమతించారు. ముందుగా ఎద్దులకు వెటర్నరీ వైద్యులు పరీక్షలు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులు ఎద్దుల యజమానులు, క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వడివాసల్ నుంచి ఒక్కో ఎద్దు రంకెలేస్తూ పరుగులు తీయగా, వాటిని అదుపుచేసేందుకు క్రీడాకారులు పోటీపడ్డారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు, క్రీడాకారులకు అందకుండా వెళ్లిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలు చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలు, జిల్లాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రేమగా మాట్లాడితే జంతువులూ వింటాయి

- ఏనుగులను అడవిలోకి పంపిన కార్మికులు




ఏనుగులను వేడుకుంటున్న కార్మికులు

పెరంబూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా వాల్పారై పరిసర ప్రాంతాల్లోని ఎస్టేట్‌లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఈ క్రమంలో, వాల్పారై సమీపం కురంగుముడి శ్రీరామ్ ఎస్టేట్ తేయాకు తోటలో మంగళవారం 40 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఆ సమయంలో సమీపంలోని అడవి నుంచి ఒక గున్న ఏనుగుతో పాటు మూడు ఏనుగులు తోటలోకి వచ్చాయి. అప్పుడు కార్మికులు ఏనుగులను చూసి 'సామి అలాగే అడవిలోకి వెళ్లండి... మేము పనిచేయాలి... మిమ్మల్ని మేము ఏమీ చేయము... మీరు గున్న ఏనుగుతో ప్రశాంతంగా అడవిలోకి వెళ్లండి' అంటూ నమస్కారం పెడుతూ వేడుకున్నారు. కార్మికుల మాటలు అర్థమయ్యాయో, లేదో కాని, వెంటనే మూడు ఏనుగులు నెమ్మదిగా అడవిలోకి వెళ్లగా, కార్మికులు తమ పనుల్లో నిమగ్నమయ్యారు.

రామేశ్వరంలో శివరాత్రి వేడుకలు ప్రారంభం

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామేశ్వరం రామనాథస్వామివారి ఆలయంలో మాసి మహా శివరాత్రి వేడుకలు ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ధ్వజస్తంభ మండపం వద్ద సర్వాలంకరణతో ఆశీనులైన రామనాథస్వామి, పర్వతవర్థినీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ధ్వజస్తంభం వద్ద మహాదీపారాధన నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవారు స్వర్ణ సప్పరంలో ఆలయ ప్రధాన వీధులలో ఊరేగారు. రాత్రి పర్వతవర్థినీ అమ్మవారు స్వర్ణ కామధేను వాహనంలో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. ఇదేరీతిలో రోజూ స్వామి, అమ్మవారు వివిధ వాహనాల్లో ఊరేగనున్నారు. ఈ నెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల మహారథోత్సవం నిర్వహించానున్నారు. మార్చి 1న చండికేశ్వరస్వామి ఊరేగింపుతో ఈ వేడుకలు ముగియనున్నాయి.



రామనాథస్వామివారి ఆలయం

ఘనంగా అయిడా అవార్డుల ప్రదానోత్సవం

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైనింగ్ విభాగాలలో నిప్పాన్ పెయింట్స్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యా సంస్థలకు, నిపుణులకు అయిడా (ఆసియా యంగ్ డిజైనర్ అవార్డు) అవార్డుల ప్రదానం చేసింది. ఈ అవార్డుల ప్రదానోత్సవం వేలూరులోని వీఐటీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిప్పాన్ పెయింట్ (ఇండియా) డెకరేటివ్ డిజైన్ ప్రెసిడెంట్ మహేష్ ఆనంద్, వీఐటీ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంధ్య సమక్షంలో జరిగింది. బెంగళూరుకు చెందిన ఆర్వీ కాలేజీ ఆఫ్ ఆర్కిటెక్చర్‌కు, చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆర్కిటెక్చర్ అధ్యాపకులు జకియా ఫాతిమా సహా ఎనిమిది మందికి అవార్డులను ప్రదానం చేశారు. ఈ పోటీలలో స్వర్ణపతకాలు అందుకున్న సాన్యా గుప్తా, యుక్తా త్వరలో అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారని నిప్పాన్ పెయింట్స్ సంస్థ నిర్వాహకులు తెలిపారు.



అవార్డు గ్రహీతలతో నిప్పాన్ పెయింట్ సంస్థ నిర్వాహకులు

'స్టార్టప్ సింగం' వేల్యూకార్న్ ఆవిష్కరణ



స్టార్టప్ సింగం ఆవిష్కరణలో నిర్వాహకులు

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ వ్యవస్థ పునర్నిర్మించడానికి సాహసోపేతమైన చర్యల్లో భాగంగా 'స్టార్టప్ సింగం' వేల్యూకార్న్ బుధవారం నగరంలో ఆవిష్కృతమైంది. ఇది అధిక విలువల కోసం పోటీలో చిక్కుకునే బదులు దీర్ఘకాలిక విలువపై దృష్టి పెట్టడానికి వ్యవస్థాపకులను ప్రోత్సహించడానికి రూపొందించబడిన ఒక మార్గదర్శక చొరవ అని ముదల్ పార్ట్‌నర్స్ అండ్ గో ఫ్రాగల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, జోహో సహ వ్యవస్థాపకుడు కుమార్ వేంబు ఈ సందర్భంగా మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్టార్టప్ సింగం సహ వ్యవస్థాపకులు హేమచంద్రన్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నై పెరంబూరులోని ఐసీఎఫ్ కర్మాగారాన్ని సందర్శించి అక్కడ తయారవుతున్న వందే భారత్ రైళ్ల విడిభాగాలను పరిశీలిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి



జాతీయ విద్యా విధానం పేరుతో హిందీ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం ఆందోళన చేపట్టిన చెన్నై రాజధాని కళాశాల విద్యార్థులు

ఏప్రిల్ 15 వరకు ట్రెక్కింగ్‌పై నిషేధం



చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా ఉన్న కొండ ప్రాంతాల్లో పర్వతారోహణ కార్యక్రమాలపై ఏప్రిల్ 15 వరకు ప్రభుత్వం నిషేధం విధించింది. నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూరు, సేలం, తేని, మదురై, దిండుగల్, విరుదునగర్, కృష్ణగిరి, తిరుపత్తూరు, కన్నియాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి సహా 40 ప్రాంతాల్లో ప్రభుత్వం పర్వతారోహణ (ట్రెక్కింగ్)కు అనుమతించింది. గత యేడాది నుండి ఠీఠీఠ్రీ.ట్రుఖ్జ్ఞిరుజీజ్ఞుచ్చీఙుఱొరు అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్నవారిని ట్రెక్కింగ్‌కు అనుమతిస్తోంది. ప్రస్తుతం అడవుల్లో ఉష్ణోగ్రత అధికమై అక్కడక్కడా అగ్ని ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రభుత్వం ట్రెక్కింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని భావించింది. ఆ మేరకు ఏప్రిల్ 15 వరకు ట్రెక్కింగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది.

విరుగంబాక్కంలో రూ.1.60 కోట్లతో అభివృద్ధి పథకాలు



కొత్త భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సౌత్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని విరుగంబాక్కం శాసనసభ నియోజకవర్గంలో కొత్తగా నిర్మించిన వ్యాయామశాల, అంగన్వాడీ భవనం, రేషన్‌షాపు, శిశుసంరక్షణ భవనం సహా పలు భవనాలను ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం బుధవారం ఉదయం ప్రారంభించారు. డీఎంకే ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, విరుగంబాక్కం ఎమ్మెల్యే ప్రభాకరరాజా నియోజకవర్గం అభివృద్ధి నిధుల నుండి కేటాయించిన రూ.1.60 కోట్లతో ఈ భవనాలను నిర్మించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వివిధ స్టాండింగ్ కమిటీ లచైర్మన్లు, డీఎంకే పార్టీ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'పుల్‌మాన్'



హోటల్ ఆవిష్కరణలో ప్రముఖులు

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలో పుల్‌మాన్ హోటల్స్ బుధవారం ప్రారంభించారు. 1859లో స్థాపించబడిన ఆతిథ్యబ్రాండ్ అయిన పుల్‌మాన్ హోటల్స్ సంస్థ దక్షిణభారతదేశంలోకి అడుగుపెట్టింది. సీబ్రోస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, నూతన హోటల్ యజమాని సి.సుబ్బారెడ్డి, పుల్‌మ్యాన్ ఆసియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గర్త్ సిమ్మన్స్ తదితరులు హోటల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఆధునిక సౌకర్యాలు, అత్యాధునిక సాంకేతికతను అనుసంధానిస్తూ 232 గదులతో ఏర్పాటైన ఈ హోటల్.. విస్తృత ఈవెంట్లను కూడా అందిస్తోంది.



భక్తులకు భరోసా టీటీడీ ఫీడ్‌బ్యాక్ బుక్

● మంత్రి వాసంశెట్టి సుభాష్

తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయాన్ని సందర్శించే భక్తుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి టీటీడీ ఫీడ్‌బ్యాక్ బుక్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం స్వామిని దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇది భక్తులకు భరోసా ఇస్తుందన్నారు. 99.6 శాతం పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోందన్నారు. గత ఎనిమిది నెలలుగా శ్రీవారి ప్రసాదాల నాణ్యత పెంపు, పరిశుభ్రత చాలా పకడ్బందీగా జరుగుతోందన్నారు. కాగా శ్రీవారిని దర్శించుకున్న మంత్రి సుభాష్ మహాద్వారం గేటు నుంచి కాకుండా బయోమెట్రిక్ నుంచే వెలుపలకు రావడం విశేషం.

→ బయోమెట్రిక్ నుంచి ఆలయం వెలుపలకు వస్తున్న మంత్రి సుభాష్



సురుటుపల్లిలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

నాగలాపురం, ఫిబ్రవరి 19, (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ధ్వజస్తంభం వద్ద పంచ మూర్తుల ఉత్సవర్లకు అభిషేకాది కార్యక్రమాలను చేపట్టారు. యాగశాల మండపంలో వృషభయాగం నిర్వహించారు. పూర్ణాహుతి జరిపి నందీశ్వరుడి చిత్రంతో ఏర్పాటు చేసిన ధ్వజపటానికి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉదయం 11.30 నుంచి 12 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజ పటాన్ని ధ్వజస్తంభంపైకి ఎగురవేశారు. తద్వారా శివరాత్రి ఉత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు.

ధ్వజ పటాన్ని ఎగుర వేస్తున్న అర్చకులు

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.81 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,427

తలనీలాలు సమర్పించినవారు: 21,066





భక్తుల కొంగు బంగారం

శ్రీకాళహస్తిలోనే కాదు భట్లకనువూరులోనూ కాళహస్తీశ్వరుడు కొలువుదీరి నిత్య పూజలందుకుంటున్నాడు. ఆధ్యాత్మిక వెలుగులు పంచుతున్నాడు. 1246లో ఈ దేవాలయాన్ని చోళుల చివరి రాజైన రాజేంద్ర చోళ-3 హయాంలో అరవభూమి రెడ్ల వంశస్తులు నిర్మించారని చెబుతారు. అప్పట్లోనే ఆలయ నిర్వహణకు లోటుపాట్లు రాకుండా 80 ఎకరాల మాన్యాన్ని కేటాయించారు. - ఓజిలి,ఆంధ్రజ్యోతి

శివరాత్రి వేడుకలకు సిద్ధం : ప్రస్తుతం జ్ఞానప్రసూనాంబ సమేత కాళహస్తే ఆలయంలో నిత్యారాధనలు,జరుగుతున్నాయి. ఇటీవల త్రైమాస పూజలను ఘనంగా నిర్వహించారు. ఏటా కోనేరులో నిర్వహించే తెప్పోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 26న శివరాత్రి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, దేవదాయ అధికారులు, గున్నంరెడ్డి కుటుంబీకులు సంయుక్తంగా కృషి చేస్తున్నారు.

●భట్లకనువూరులో కాళహస్తీశ్వరాలయం



జ్ఞానప్రసూనాంభ సమేత కాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానం

నాలుగేళ్లుగా పూర్వ వైభవం : నాలుగు దశాబ్దాల క్రితం వరకు దేవాలయ నిర్వహణ సజావుగానే కొసాగింది. తర్వాత గ్రామంలో వివిధ పరిణామాల నేపథ్యంలో దేవాలయాన్ని పట్టించుకోలేదు. ధూప,దీప, నైవేద్యం పెట్టేవారే కరువయ్యారు. ఆరాధనలు అటకెక్కాయి. జీర్ణాలయంగా మారిపోయింది. ప్రహరీ గోడలు పడిపోయాయి. ధ్వజస్తంభం విరిగిపోయింది. ఈక్రమంలో నాలుగేళ్ల క్రితం గ్రామస్తులందరూ. ఆలయ నిర్వహణపై దృష్టి పెట్టారు. గ్రామానికి చెందిన గున్నంరెడ్డి కుటుంబీకులతోపాటు మరికొందరు దాతలు ముందుకు వచ్చారు. మాన్యం భూములకు క్రమం తప్పకుండా వేలం నిర్వహించారు. ఏటా రూ.5 లక్షల రాబడికి ఆలయం చేరుకుంది. దాతల సహాయం రూ.1.30 కోట్లతో కాళహస్తీశ్వరాలయానికి పూర్వ వైభవాన్ని తెచ్చారు. ఆలయంలో ప్రాంగణంలో చిన్న దేవాలయాలను సైతం నిర్మించారు. దీంతో దేవదాయ శాఖ సీ కేటగిరీల ఆలయంగా తన పరిధిలోకి తీసుకుంది.

25 రోజుల్లో..

● 148 కిలోల గంజాయి స్వాధీనం
● 225 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్
● బహిరంగంగా మద్యంతాగే వారిపై 2378 కేసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాదారులు.. ఆకతాయిలు, రౌడీషీటర్లు.. ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగేవారిపై పోలీసులు నిఘా పెట్టారు. ఎప్పటికప్పుడు వారిపై చర్యలు తీసుకుంటూ, కేసులు పెడుతున్నారు. ఇలా గత 25 రోజుల వ్యవధిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేసి 148 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 225 మంది రౌడీషీటర్లను ఆయా పోలీసు స్టేషనకుఉ పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మళ్లీ గలాటాలు, ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. ఇక తిరుపతిలో పాటు చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరు, పాకాల.. ఇలా పలుచోట్ల శివార్లలో బహిరంగంగా మద్యంతాగే ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. అక్కడ పొదలు, చెట్లు ఉంటే శుభ్రం చేశారు. ఇలాంటి చోట్ల మద్యం తాగితే చర్యలు చేపడతామని హెచ్చరించారు. కాగా, పదే పదే బహిరంగంగా మద్యంతాగుతూ పట్టుబడిన 2378 మందిపై కేసులు నమోదు చేశారు. 372 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 1597 మంది చిరు వ్యాపారులపై న్యూసెన్సు యాక్టు కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది 1686 సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడి చట్టాలపై అవగాహన కల్పించారన్నారు. చట్టాలను అతిక్రమించి ప్రవర్తించిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టండి

● కష్టపడ్డ కార్యకర్తను కాపాడుకుంటాం ● అలకలతో ఏమీ సాధించలేం ● పార్టీ శ్రేణులకు టీడీపీ యువనేత లోకేశ్ దిశానిర్దేశం



తిరుపతి నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న లోకేశ్

తిరుపతి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ తొలిసారిగా తిరుపతిలో అర్ధరోజు పాటు పార్టీ శ్రేణుల కోసం కేటాయించారు. బుధవారం తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన కపిలతీర్థం పక్కనున్న పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, పార్టీ సభ్యత్వం, ఓటరు వెరిఫికేషన్, మన టీడీపీ యాప్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యకర్తలు ఇచ్చిన వినతులను స్వీకరించారు. వారి మాటలను సావధానంగా విన్నారు. గ్రూపు రాజకీయాలు చేస్తున్న నాయకులకు చురకలంటించారు. తిరుపతి నియోజకవర్గంలో ఇప్పటికైనా అలకలు విడిచిపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వం రెండూ అనుసంధానమై ముందుకు పోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తమను గుర్తించడంలేదని చాలామంది తనదృష్టికి తీసుకొస్తున్నారని, సీనియర్లు, జూనియర్లు అని లేకుండా పనిచేసినవారందరినీ సమానంగా గౌరవిస్తామన్నారు. పార్టీలేకపోతే ఇక్కడ మనమెవరూ లేరన్న విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా తిరుపతి నేతలు ఆ విషయం తెలుసుకోవాలన్నారు. అధికారం వచ్చేసింది కదా...తిరుగులేని ధోరణితో ఉండడం సరికాదన్నారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలబడాలన్నారు.. వైసీపీ పెట్టిన అక్రమ కేసులు ఉన్నవారు భయపడొద్దని, త్వరలోనే వాటిని కొట్టివేయడం జరుగుతుందన్నారు. పార్టీ ఏకార్యక్రమం పిలుపునిచ్చినా కలిసికట్టుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తప్పుచేసిన వైసీపీ వాళ్లకు చట్టప్రకారం శిక్ష ఉంటుందని స్పష్టంచేశారు. ప్రతిపక్షం చేసే దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలతో మమేకమైతేనే క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుస్తాయన్న స్పష్టతకు అధిష్ఠానం ఇప్పటికైనా వచ్చిందని పార్టీ శ్రేణులు భావించాయి.

పనికోసం పోతే పార్టీలోకి రమ్మన్నారు

ఏదైనా కాంట్రాక్టు పనులు ఇప్పించమని కూటమి ఎమ్మెల్యే కార్యాలయానికి వెళితే జనసేన పార్టీలో చేరమని ఒత్తిడిచేశారని, అప్పుడు పనులు కూడా ఇస్తామని చెప్పారని ఓ మహిళా నేత లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. కూటమి పార్టీలు కలిసిమెలిసి ఉండాలని ఇలాంటి వాతావరణం ఉండకూడదని చెప్పినట్టు తెలిసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని పక్కనే ఉన్న ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సూచించినట్లు సమాచారం. ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదని, ఒకరిదగ్గరకు వెళితే మరొకరికి కోపం వస్తోందని కార్యకర్తలు వాపోయారు. 'మీ పనితీరు ఏంటో మా దగ్గర ఉంటుంది. మీకు ఏవిధంగా న్యాయం చేయాలో పార్టీ చూసుకుంటుంది' అని భరోసా ఇచ్చారు. 'నరసింహ యాదవ్‌కు రాష్ట్ర పదవి వచ్చింది. రాష్ట్రమంతా తిరగాలి. అందరికీ అందుబాటులో ఉండాలి' అని చెప్పారు.

కార్పొరేటర్లతో సమావేశం

ఇటీవల జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ విజయం కోసం పనిచేసిన కార్పొరేటర్లు లోకేశ్ కలిశారు. టీడీపీ అభ్యర్థిని ఎన్నుకున్నందుకు అభినందించారు. అందరూ కలసి అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. అందరినీ కలుపుకుని నగరాభివృద్ధికి కృషిచేయాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణకు సూచించారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు మంచివ్యక్తిని డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారని జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని ఈసందర్భంగా చెప్పారు. ఈకార్యక్రమంలో పార్టీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, రవినాయుడు, మబ్బు దేవనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అంటే అట్లుంటది

'వాట్ సత్యన్న (జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్) తలపై వెంట్రుకలు ఊడిపోయినట్టున్నాయ్? తిరుపతి జిల్లా బాధ్యతలు అంటే అట్లుంటయ్' అని మంత్రి అనగానిని ఉద్దేశించి నారా లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. తాను రెండు జిల్లాల్లో పనిచేసినప్పటికీ తిరుపతి జిల్లాలో పనిచేయడమంటే సవాల్‌గానే ఉందని అనగాని ప్రతిస్పందించడంతో సభలో నవ్వులు విరిశాయి. 'తిరుపతి అంటే అట్లుంటది' అని అక్కడివారు గుసగుసలాడుకోవడం కనిపించింది.

టీడీపీ ఉత్తమ కార్యకర్తల సమావేశంలో అభిప్రాయాలను తెలుసుకుంటున్న లోకేశ్





తుడాపై మంత్రి నారాయణ సమీక్ష

తిరుపతి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అధికారులతో మంత్రి నారాయణ బుధవారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో సమీక్షించారు. తుడాకు వస్తున్న రెవెన్యూ, ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదాయపెంపుపై తీసుకోవాల్సిన చర్యలపై దాశానిర్దేశం చేశారు. పీపీపీ విధానంలో భూములను అభివృద్ధి చేసి అమ్మకాలు చేయడం ద్వారా ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుడా పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను తుడా నుంచి విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. అన్నమయ్య సర్కిల్లో నిర్మిస్తున్న 13 అంతస్థుల తుడా టవర్స్ పనులపైనా మంత్రి ఆరా తీశారు. దానికి సంబంధించిన బ్రోచర్‌ను అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ కమిషనర్ సంపత్ కుమార్, తుడా వీసీ మౌర్య, ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత హాజరయ్యారు.

చిన్నశేష వాహనంపై శ్రీవారి చిద్విలాసం





చిన్నశేష వాహనంపై కల్యాణ వెంకన్న - హంస వాహనంపై సరస్వతీ అలంకరణలో స్వామివారు

చంద్రగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం స్వామివారు ఉదయం చిన్నశేషవాహనం, రాత్రి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన సేవలు నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తి మురళీకృష్ణుడి అలంకరణలో చిన్నశేష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. రాత్రి పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో శోభయమానంగా సరస్వతీ దేవి అలంకరణలో హంస వాహనంపై అధిష్ఠించారు. వృషభ, అశ్వ, గజరాజులు ముందు కదులుతుండగా మేళతాళాలు, మంగళ, కేరళా వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, గోవింద నామ స్మరణల మధ్య స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ఉదయం స్నపన తిరుమంజనం సాయంత్రం ఊంజల్ సేవలను వేడుకగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, కంకణ భట్టర్ నారాయణాచార్యులు, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారధి, శేషాచార్యులు, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఇన్స్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు...

బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపుపందిర వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వామి అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించనున్నారు.



శివపార్వతులకు పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి మదనపల్లెకు చెందిన రాటకొండ గురుప్రసాద్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. మదనపల్లెలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అధినేత రాటకొండ గురుప్రసాద్ ఏటా మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేస్తుంటారు. అదే క్రమంలో ఈ ఏడాది ఉత్సవాల ఆరంభానికి ముందుగా బుధవారం గురుప్రసాద్ దంపతులు శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకుని ఈవో బాపిరెడ్డికి పట్టువస్త్రాలను అందజేశారు. అమ్మవారిపేరుతోనే మదనపల్లెలో డిగ్రీ కళాశాలను నెలకొల్పామని గురుప్రసాద్ తెలిపారు.





జలవినాయకుడి కూడలి వద్ద నటరాజస్వామి విద్యుత్ దీపాలంకరణ - విద్యుత్ దీపాలంకారంతో మెరిసిపోతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం





విద్యుద్దీపాల వెలుగులో శ్రీకాళహస్తి క్షేత్రం మెరిసిపోతోంది. శుక్రవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు మొదలు కానున్న నేపథ్యంలో.. రెండు రోజుల ముందే విద్యుత్తు దీపాల అలంకరణ పూర్తి చేశారు. విద్యుద్దీపాలతో దేవతామూర్తుల కటౌట్లు, పట్టణమంతా శోభాయమానంగా మారింది. ఆలయ పరిసరాలు, స్వర్ణముఖి నదిపై వంతెనలు వెలిగిపోతున్నాయి. ఉత్సవాల అంకురార్పణకు సమయం ఆసన్నం కావడంతో తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



శ్రీకాళహస్తీశ్వరాలయం, శివపార్వతుల విగ్రహాలు - రామసేతు వంతెన వద్ద వినాయకుడి విద్యుత్ దీపాలంకరణ